క్లుప్తంగా

ఖరీఫ్ సీజన్‌కు రైతుల సమాయత్తం


మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలో ఖరీఫ్ 2025 సీజన్ పంట కాలానికి సంబంధించి వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందని వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ వారు తెలిపారు. ఈ మేరకు అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా సోమవారం నిడగల్లులో ఖరీఫ్ సీజన్‌లో అవలంబించాల్సిన విధానాలపై అవగాహనసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి రైతులు పచ్చిరొట్ట పంటలు వేసుకోవాలని తెలియచేశారు.వాటిని భూమిలో కలియదున్నడం వల్ల నేలకు పోషకాలు అందుతాయి, సేంద్రియ పదార్థం పెరుగుతుంది, నేల నిర్మాణం మెరుగుపడుతుందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గిరిజన శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి రూ.21 లక్షలతో నిర్మించనున్న పీఏసీఎస్ భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీరామమూర్తి, గ్రామ సర్పంచ్ సువ్వాడ శశికళ, వైస్ ఎంపీపీ సువ్వాడ గుణావతి తదితరులు పాల్గొన్నారు.

కామాక్షమ్మకు వెండి చీరతో అలంకరణ


వెండి చీర అలంకరణలో దర్శనమిస్తున్న కామాక్షమ్మ

సాలూరు: పట్టణంలోని కామాక్షమ్మ తల్లి వెండి చీర అలంకరణలో భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. కామాక్షి అమ్మవారి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన సోమవారం అమ్మవారిని వెండిచీరతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు.

14 నుంచి కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ

గరుగుబిల్లి: మండల పరిధిలోని తోటపల్లిలో ఉన్న జట్టు ట్రస్టు కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు జట్టు ట్రస్టీ డి.పారినాయుడు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి జె.మురళి పర్యవేక్షణలో మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో ఎలా విజయం సాధించాలి, ధ్యానం, జ్ఞాపకశక్తి, బృంద కార్యక్రమాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలంలో శిక్షణార్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9177114333, 8179012050లను సంప్రదించాలని కోరారు.

కనుమరుగైన రచ్చబండలు

- గ్రామాలకు చెందిన అంశాలపై చర్చలకు వేదిక


వంతరాంలో రచ్చబండ వద్ద కూర్చున్న గ్రామస్తులు

బలిజిపేట:

గతంలో పల్లెలు అంటే రచ్చబండలు ఉండి తీరాలనేది ఒక శాసనంగా ఉండేది. ఒక పెద్ద చెట్టు కింద రచ్చబండపై కూర్చుని మాటమంతీ మంచిచెడు, గ్రామానికి సంబంధించిన ఎటువంటి శుభకార్యాలను నిర్వహించాలన్నా, గ్రామ సమస్యలను పరిష్కరించాలన్నా పెద్దమనుషులు రచ్చబండపై కూర్చుని సమష్టిగా నిర్ణయం తీసుకునేవారు. దీన్ని గ్రామస్తులు పాటించేవారు. వ్యక్తిగత సమస్యలతో పాటు కుటుంబ సమస్యల పరిష్కారానికి రచ్చబండ వేదికగా ఉండేది. అది పంచాయితీ రచ్చబండగా మారేది. గ్రామాల అభివృద్ధిలోనూ రచ్చబండలు, అక్కడి పెద్దమనుషులు, ఊరిపెద్ద ఎంతో క్రియాశీలక పాత్ర పోషించేవారు. అయితే నేడు పల్లె వాతావరణంలో అది కనుమరుగైంది. పల్లెల్లో గ్రామపెద్దలు లేరు. రచ్చబండలు కనిపించవు. కొన్ని గ్రామాల్లో మాత్రం పాత తరాలకు తీపి గుర్తుగా రచ్చబండలు సాక్ష్యాలుగా మిగిలాయి. ఆకారానికి మాత్రమే పరిమితం తప్ప చర్చలు, నిర్ణయాలకు మాత్రం మూగబోయాయి.



పల్లెకు గుండెకాయ

రచ్చబండలు పల్లెలకు గుండెకాయల్లా ఉండేవి. గతంలో గ్రామాల మధ్యలో రచ్చబండలు ఏర్పాటు చేశారు. సాయంత్రం సమయంలో పెద్దలు, గ్రామస్తులు రచ్చబండ వద్దకు వచ్చేవారు. గ్రామంలో జరిగే మంచి, చెడ్డ అక్కడ చర్చించుకునేవారు. కుటుంబాల్లోని సమస్యలు అప్పటికప్పుడే పరిష్కారమయ్యేవి. గ్రామంలో కొందరు కులపెద్దలు, ఊరిపెద్దలుండేవారు. నాడు రచ్చబండ ఉన్న గ్రామాల్లోకి పోలీసులు సైతం వెళ్లేందుకు ఇష్టపడేవారు కాదు. ప్రజలు ఎంతో బాధ్యతగా ఉండేవారు. రచ్చబండ రాజకీయాలకు సైతం వేదికగా ఉండేది. గ్రామాల్లోకి ఎవరైనా ప్రముఖులు, నాయకులు వచ్చినా రచ్చబండే వేదికయ్యేది. గ్రామంలో ఏఇంట ఏం జరిగినా సమాచారం రచ్చబండ వద్దకు చేరేది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో రచ్చబండలు ఉన్నప్పటికీ వాటిపై కూర్చుని మాట్లాడుకోవడం, నిర్ణయాలు తీసుకోవడం కనిపించదు. ప్రస్తుతం గ్రామాల్లో ఉండే రచ్చబండలపై పులిమేక ఆటలు, సెల్‌ఫోన్లు చూసుకోవడం, సమీపంలో ఉండేవారు పప్పుదినుసులు ఆరబెట్టుకోవడానికి వినియోగిస్తున్నారు. గ్రామాల్లో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, సామాజిక చైతన్యం కలగడం, సమాజంలో మార్పులు సంభవించడంతో రచ్చబండలకు ప్రాధాన్యం తగ్గింది.

సమాజంలో మార్పు

సమాజంలో మార్పుతో పల్లె వాతావరణం కలుషితమైంది. రాత్రి, పగలు తేడాలేకుండా ఇళ్లల్లో టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఎవరి పనుల్లో వారు బిజీగా ఉంటున్నారు. వ్యవసాయం చేసేవారి సంఖ్య తగ్గడం, పట్టణాలకు వలసలు వెళ్లడంతో పల్లెవాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. ఒకరి విషయాల్లో మరొకరు తలదూర్చని పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి. పల్లెల్లో కక్షలు, కార్పణ్యాలు పెరిగి వివాదాలు ఎక్కువై ఒకరంటే ఒకరికి పడకపోవడంతో ఐక్యత దెబ్బతింది. ముఖ్యంగా రాజకీయ ప్రభావం ప్రజలపై కనిపిస్తోంది. రచ్చబండలకు ప్రాధాన్యం తగ్గింది. పోలీస్‌స్టేషన్లకు ఫిర్యాదులు పెరిగాయి. ఒకప్పుడు వెలుగు వెలిగిన రచ్చబండలు నాటి వెలుగులకు నేడు మూగ సాక్ష్యాలుగా మారాయి.

ఆదరణ తగ్గింది

పల్లెల్లో రచ్చబండలకు గతంలో ఎంతో ప్రాధాన్యం ఉండేది. అన్ని అంశాలను చర్చించేవారు, మంచి, చెడు, కష్టం, సుఖంలో అందరి పాత్ర ఉండేది. ఇప్పుడు ఎవరు ఎలాపోయినా మాకేంటి నష్టం అనే ధోరణి వచ్చింది. ఇలాగే రచ్చబండలకు ప్రాధాన్యం తగ్గింది. రచ్చబండలపై తీర్మానాలు శిలాశాసనాలుగా ఉండేవి.
–పోలినాయుడు, పలగర, బలిజిపేట మండలం

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు


సారిక పంచాయతీ కొత్తూరులో నిరుపయోగంగా ఉన్న సంపద సృష్టి కేంద్రం

సాలూరు రూరల్: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న చెత్తనుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ సాలూరు మండలంలో సక్రమంగా సాగడం లేదు. మండలంలోని చాలా కేంద్రాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. గ్రామాల్లో చెత్త సేకరించి అక్కడే ఎరువుగా తయారు చేసి రైతులకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వాటి నిర్వహణను గాలికి వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మళ్లీ ఈ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అధికారులు ప్రకటించడమే తప్ప మండలంలో ఈ కేంద్రాలు నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. ఇదిలా ఉండగా చాలావరకు గ్రామాల్లో అసలు చెత్త సేకరించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. మామిడిపల్లి, కూర్మరాజుపేట వంటి గ్రామాలలో చెత్త సేకరించినప్పటికీ ఆ చెత్తను ఊరి ముఖద్వారాల వద్ద వేస్తున్నారు. అంతేకాకుండా అందులో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తగులబెడుతున్నారు.

నేరెళ్ల వలస రోడ్డుకు మోక్షమెప్పుడు?


గోతుల మయంగా ఉన్న నేరెళ్ల వలస రోడ్డు


పూర్తిగా రాళ్లు తేలిన రోడ్డు

సాలూరు రూరల్: మండలంలోని సారిక, నేరెళ్ల వలస రోడ్డు పూర్తిగా రాళ్లు తేలి గోతులమయంగా మారింది. ఈ రోడ్డు పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నిధుల మంజూరుకు ప్రతిపాదనలు చేయగా నిధులు మంజూరుకు సిద్ధంగా ఉన్న సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావస్తున్నా కొఠియా గ్రూపు గ్రామాల గిరిజనులకు ఎంతో అవసరమైన ఈ రహదారి పనులపై ఇప్పటికీ దృష్టి సారించకపోవడం విచారకరం. నిత్యం ఈ రోడ్డులో దాదాపు 22 గ్రామాల గిరిజన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ రోడ్డు పెద్ద గోతులతో రాళ్లుతేలి ఉండడంతో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని పలువురు గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు పనులు ప్రారంభించి గిరిజనులకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ద్విచక్ర వాహనదారుడిపై కేసు నమోదు

పార్వతీపురం రూరల్: పట్టణానికి చెందిన మెడికల్ షాపు యజమాని ఎ.కిరణ్ కుమార్‌ను త్రిబుల్ డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి ఢీకొట్టడంతో డ్రైవింగ్ చేసిన శివిని గ్రామానికి చెందిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు పార్వతీపురం పట్టణ సీఐ కె.మురళీధర్ తెలిపారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ ప్రధానంగా యువత జిల్లా కేంద్రంలోని పరిమితికి మించి ద్విచక్ర వాహనంపై ప్రయాణించడం మితిమీరిన వేగంతో వెళ్లడం వంటి చర్యలు మానుకోవాలని సూచించారు. కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

వెలవెలబోయిన గ్రీవెన్స్‌సెల్


ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కూర్చున్న అధికారులు

పార్వతీపురం రూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదు దారులు ఎవరూ రాకపోవడంతో వెలవెలబోయింది. ఒక పక్క భానుడి ప్రభావంతో ప్రజలు ఉక్కబోతతో అల్లాడిపోతూ బయటకు వచ్చేందుకు సంకోచిస్తున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పనులు జరుగుతున్న నేపథ్యంలో అరకొరగా వచ్చిన ఫిర్యాదులతో ఎంపీడీఓ జి. రమేష్ గ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నామమాత్రంగా వచ్చిన కొన్ని అర్జీలను స్వీకరించి పరిష్కారం చూపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ జీవీ రమణమూర్తి, వెలుగు ఏపీఎం బి.సన్నిబాబు, హౌసింగ్ ఏఈ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మురళీనాయక్‌కు నివాళులు

- పెదపెంకిలో వేతనదారుల ర్యాలీ


పెదపెంకిలో ర్యాలీ చేస్తున్న ఉపాధి వేతనదారులు


సీతానగరంలో కొవ్వొత్తులతో ర్యాలీ

బలిజిపేట: పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో మరణించిన అగ్నివీర్ ముదావత్ మురళీనాయక్‌కు బలిజిపేట మండలంలోని పెదపెంకి గ్రామంలో ఉపాధి వేతనదారులు నివాళులర్పించారు. నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు ఆధ్వర్యంలో ఉపాధి వేతనదారులు పని పూర్తయిన వెంటనే మురళీనాయక్‌కు నివాళులర్పిస్తూ గారపైడిమాంబ అమ్మవారి గుడి నుంచి గాంధీ సెంటర్ వరకు వీరజవాన్‌కు జోహార్లు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద కొంతసమయం మౌనం వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ యుద్ధంలో మరణించిన వీరజవాన్ మురళీనాయక్ తెలుగువాడవడం దేశంకోసం ప్రాణాలొడ్డడం ఎంతో గర్వకారణమన్నారు. అటువంటి వీరుడికి అందరం రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి వేతనదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

దేశంకోసం ప్రాణత్యాగం చేసిన వీరజవాన్ మురళీనాయక్‌కు సీతానగరం మండలంలోని లక్ష్మీపురంలో యువకులు, విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు లక్ష్మీపురం పురవీధుల్లో వందలాది మంది జోహార్ జోహార్ మురళీ నాయక్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. పాకిస్తాన్‌కు భద్రతా దళాలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కె.ధనుంజయ్, టి.శ్రీనివాస్, పి.అప్పన్న, పి త్రినాథరావు, సీహెచ్ ఉమామహేశ్వరరావు. సత్యం, త్రినాథ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి కల్పించాలి


డిప్యూటీ ఎంపీడీవో దేవకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మక్కువ: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల పునర్వ్యవస్థీకరణ చేయనున్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి కల్పించాలని కోరుతూ మక్కువ మండలం పంచాయతీ కార్యదర్శులు సోమవారం డిప్యూటీ ఎంపీడీవో పి.దేవకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పంచాయతీ కార్యదర్శులు పదోన్నతిపై ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. ప్రమోషన్‌తో పాటు, మెరుగైన జీతభత్యాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు వారు తెలిపారు.

అనారోగ్యంతో ఎంపీటీసీ మృతి

- నివాళులు అర్పించిన మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర మావుడి సోదరులు


ఎంపిటిసి వెంకట్ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్న దొర, మావుడి సోదరులు

మక్కువ: మక్కువ మండలం పనసభద్ర పంచాయతీ ఎంపీటీసీ సామంతుల వెంకట్ సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఎంపీటీసీ వెంకట్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తుది శ్వాస విడిచారు. ఈ సందర్భంగా వెంకట్ స్వగ్రామమైన ఎరసామంతవలస గ్రామానికి సోమవారం మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకుని ఎంపీటీసీ వెంకట్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులును మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర మావుడి సోదరులు పరామర్శించి ఓదార్చారు.

కనులపండువగా నూకాలమ్మ తల్లి పండగ

పాచిపెంట: మండల కేంద్రంలో 15 సంవత్సరాల తరువాత జరుగుతున్న నూకాలమ్మ తల్లి గ్రామదేవత పండుగ కనులపండువగా సోమవారం ప్రారంభమైంది.సుమారు 50 వేల మందికి పైగా భక్తులు ఈ పండగకు రానున్నారని అంచనా. భారీగా భక్తులు వచ్చే అవకాశమున్న నేపథ్యంలో రూరల్ సీఐ రామకృష్ణ పర్యవేక్షణలో 100 మంది పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నారు.సోమవారం అమ్మవారికి తొల్లేళ్ల ఉత్సవం నిర్వహించారు. ఘటాల ఊరేగింపు జరిగింది. మండల కేంద్రం భక్తులతో కిటకిటలాడింది. పండగ నేపథ్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.


నూకాలమ్మ తల్లి


పండగ నేపథ్యంలో మండలకేంద్రంలో భక్తుల తాకిడి

ఎండలు బాబోయ్ ఎండలు


మామిడిపల్లి గ్రామంలో నిర్మానుష్యంగా ప్రధాన కూడలి

సాలూరు రూరల్: మూడు రోడులుగా ఎండలు తీవ్రం కావడంతో ఉదయం 9 గంటల నుంచే గ్రామాల్లోని ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. గ్రామాల్లో ఇంటిముందు ఉన్న చెట్లు కింద సేదతీరుతున్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి మధ్యాహ్నం 1 గంట సమయంలో నిర్మానుష్యంగా మారింది. ఎండ తీవ్రతతోపాటు ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సీతంపేటలో భారీ వర్షం

సీతంపేట: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా అధిక ఎండలతో అల్లాడుతున్న ప్రజానీకానికి వర్షం ఊరటనిచ్చింది. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం గంట పాటు పడింది. దీంతో అరటి, జీడి, మామిడి పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు.

అకాల వర్షంతో అపార నష్టం


పాలకొండ రూరల్: రాజపేట - తుమరాడ మధ్యలో ఆటోపై పడిపోయిన చెట్ల కొమ్మలు

- ఈదురు గాలుల బీభత్సం
- విరిగిన విద్యుత్ స్తంభాలు.. నేలకొరిగిన చెట్లు
- నిలిచిన విద్యుత్ సరఫరా
- తక్షణ చర్యలు చేపట్టిన విద్యుత్, పోలీస్ అధికారులు

పాలకొండ రూరల్: ఉదయం నుంచి ఎండ తీవ్రత.. వడగాలుల ప్రభావంతో ఉక్కబోతకు గురై ఇళ్లకే పరిమితమైన పట్టణ, మండల వాసులకు అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఉన్నట్లుండి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. నల్లని మబ్బులు దట్టంగా కమ్ముకోవడంతో భారీ వర్షం కురుస్తుందని అంతా భావించారు. ఇంతలో ఉరుములు, మెరుపులకు ఈదురు గాలులు తోడయ్యాయి. ఒక్కసారిగా దుమ్ము రేగడంతో పాటు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు.. ఇదే సమయంలో వర్షం ప్రారంభమైంది. దీంతో పాలకొండ – వీరఘట్టం రహదారిలో భారీగా చెట్లు రహదారికిరువైపులా నేలకొరిగాయి. వాటపాగు గ్రామానికి చెందిన అప్పలనాయుడు ఆటోపై చెట్టు పడిపోయింది. ఈ సంఘటనలలో వాహన చోదకుడితో పాటు అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు పెద్ద ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మండలంలోని బుక్కూరు గ్రామానికి వెళ్లే మార్గంలో చెట్లు పడిపోడంతో బాహ్య ప్రపంచానికి రాకపోకలు నిలిచాయి. అక్కడి యువత ఈ చెట్లను తొలగించే పనిలో పడ్డారు. భాసూరు, స్థానిక కస్పా వీధిలో విద్యుత్ స్తంభాలు ఇళ్లపై నేలకొరిగాయి.

ఈదురు గాలులు..

భామిని: మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మామిడి, జీడి చెట్ల కొమ్మలతో పాటు కాయలు నేలరాలాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

లుంబూరు, ఓని రహదారుల్లో చెట్ల కొమ్మలు విరిగిపడడంతో పాదచారులు ఇబ్బంది పడ్డారు. మరోవైపు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి చేరిన పాదచారులు, ప్రయాణికుల వర్షం తగ్గేవరకూ బిక్కుబిక్కుంటూ గడిపారు. గాలుల ధాటికి పట్టణంలోని హోర్డింగ్‌లు, ఫెక్సీలతో పాటు పలు ప్రాంతల్లో పశువుల షెడ్లు, రేకుల షెడ్ల పైకప్పులు ఎగిరిపడ్డాయి. ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మండల వ్యాప్తంగా అంధకారం నెలకొంది. విద్యుత్, పోలీస్ అధికారులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు.

నిండామునిగిన రైతు..

ఈదురు గాలులతో కూడిన ఆలకాల వర్షం రైతులను నిండా ముంచింది. ముఖ్యంగా పాలకొండ, బుక్కూరు, రుద్రిపేట, అట్టలి, వెలగవాడ, తదితర ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో జీడి, మామిడి తోటలు నాశనమయ్యాయి. కాయలు నేలరాలడంతో యజమానులు, కౌలు రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. అలాగే బొప్పాయి, అరటి, మునగ, తదితర చెట్లు నేలకొరిగాయి. తుమరాడ, గరుగుబిల్లి గ్రామాల్లో చిక్కుడు, బీర, ఆనప, దొండ, తదితర తీగజాతి కూరగాయలతో పాటు పూల తోటలకు కూడా నష్టం వాటిల్లింది.


పాలకొండ రూరల్: భాసూరు గ్రామంలో ఇళ్లపై విరిగిపడ్డ విద్యుత్ స్తంభం


వీస్తున్న ఈదురుగాలులతో ఊగుతున్న చెట్లు


పాలకొండ రూరల్: రుద్రిపేట గ్రామంలో నేలరాలిన మామిడి కాయలు